క్లుప్తంగా

మానవత సంస్థకు రూ.25 వేల విరాళం

నల్లజర్ల: మానవత సంస్థ మండల శాఖకు రూ.25 వేల విరాళం లభించింది. పోతవరానికి చెందిన ఘంటా సుబ్బారావు జ్ఞాపకార్థం ఆయన భార్య అనసూయ, కుమార్తె ప్రత్తిపాటి మంగారావు, ఆమె భర్త ఈ మొత్తాన్ని విరాళంగా ఆదివారం ఆ సంస్థ సభ్యులకు అందజేశారు. వారికి మానవత సంస్థ ధన్యవాదాలు తెలిపింది. కార్యక్రమంలో మానవత సంస్థ నియంత్రణ కమిటీ చైర్మన్ కండెపు వెంకట సూర్యనారాయణ, భోగవల్లి వెంకట సుబ్బారావు, పాతూరి సత్యనారాయణ, గుళ్లపూడి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

పింఛను కోసం వెళ్లి తిరిగి రాలేదు


తాడేపల్లి దయామణి

పెరవలి: పింఛను సొమ్ము తెచ్చుకొనేందుకు పొరుగూరు వెళ్లిన వృద్ధురాలు కనిపించకుండా పోయింది. మండలంలోని తీపర్రు గ్రామానికి చెందిన తాడేపల్లి దయామణి అనే వృద్ధురాలు ఈ నెల 1న పింఛను తీసుకోవడానికి ఉండ్రాజవరం మండలం కె.సావరం గ్రామం వెళ్లింది. అక్కడి నుంచి ఆమె ఇంటికి తిరిగి రాలేదు. దీనిపై 2వ తేదీ సాయంత్రం దయామణి కుమారుడు తాడేపల్లి ఆదినారాయణ పెరవలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు.

జనవరి నాటికి రోడ్లపై గుంతలు పూడుస్తాం

పెరవలి: రాష్ట్ర వ్యాప్తంగా1,339 కిలోమీటర్ల పొడవైన రహదారులపై ఏర్పడిన గోతులను పూడ్చే కార్యక్రమం రూ.860 కోట్ల వ్యయంతో చేపట్టామని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ చెప్పారు. మండలంలోని ముక్కామల నుంచి ఎర్ర వంతెనకు వెళ్లే మార్గంలో ఏర్పడిన గోతులను పూడ్చే కార్యక్రమానికి మంత్రి ఆదివారం పూజ చేశారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ వచ్చే ఏడాది జనవరి నాటికి రాష్ట్ర వ్యాప్తంగా రోడ్ల మరమ్మతులు పూర్తి చేస్తామన్నారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో 621 కిలోమీటర్ల పొడవైన రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చిస్తామన్నారు. నిడదవోలు నియోజకవర్గంలో రూ.11.77 కోట్ల వ్యయంతో 71 కిలోమీటర్ల పొడవైన రోడ్ల గుంతలను పూడ్చే పనులు చేపట్టామన్నారు. అలాగే కొవ్వూరు నియోజకవర్గంలో రూ.నాలుగు కోట్ల వ్యయంతో రూ.28 కిలోమీటర్ల పొడవైన రోడ్లను, గోపాలపురం నియోజకవర్గంలో రూ.11.35 కోట్ల వ్యయంతో 129 కిలోమీటర్ల పొడవైన రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చిస్తామన్నారు. కార్యక్రమంలో కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, ఆర్ అండ్ బీ ఎస్ఈ వి.రెడ్డి, డీఈ వెంకటరమణ కూటమి నాయకులు పాల్గొన్నారు.

శబరిమలకు స్వాముల సైకిల్ యాత్ర


దేవరపల్లి నుంచి శబరిమలకు సైకిల్ యాత్ర ప్రారంభిస్తున్న వెంకటరమణ, డేవిడ్ స్వాములు

దేవరపల్లి: అయ్యప్పస్వామి మాలధారణ చేసిన ఇద్దరు స్వాములు దేవరపల్లి నుంచి శబరిమలకు సైకిల్ యాత్ర ప్రారంభించారు. కామిశెట్టి వెంకటరమణ, చింతాడ డేవిడ్ అనే స్వాములు ఆదివారం ఉదయం స్థానిక అయ్యప్ప స్వామి ఆలయం వద్ద పూజలు చేసి యాత్రకు శ్రీకారం చుట్టారు. గురు స్వాములు పొన్నాడ వెంకటరమణ, కాకర్ల వెంకటేశ్వరరావు, తీగెల బలరామయ్య, పలువురు స్వాములు, కుటుంబ సభ్యులు వారిని ఆశీర్వదించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఇద్దరు గురుస్వాములు మాట్లాడుతూ సుమారు 1200 కిలోమీటర్ల ప్రయాణించి, డిసెంబరు 12 నాటికి శబరిమల ఆలయానికి చేరుకుంటామన్నారు.

రెల్లి యువకులపై దాడికి నిరసన


నిడదవోలులో నిరసన తెలుపుతున్న రెల్లీలు

నిడదవోలు: మండపేటలో రెల్లి సామాజిక వర్గానికి చెందిన ముగ్గురు యువకులపై ఏడిద గ్రామ అగ్రవర్ణ యువకులు దాడి చేయడాన్ని నిడదవోలు రెల్లి సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ దాడికి స్థానిక రెల్లిపేటలో ఆదివారం రెల్లి కులస్తులు నిరసన వ్యక్తం చేశారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు మాట్లాడుతూ కులం పేరుతో దూషిస్తూ దాడి చెయ్యటం అమానుషమన్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన బొచ్చా సాయి, రమణ, బంగారు రాజేష్, సింహాద్రి, జమ్మి నటరాజ్, నా గేశ్వరరావు, చందు శ్రీదేవి, శ్రీను, గంగా పాల్గొన్నారు.

స్తంభాలను చుట్టేసిన పచ్చదనం

- గాలి వీచినా, వర్షం కురిసినా సరఫరాకు అంతరాయం
- ప్రతి శుక్రవారం ట్రీ కటింగ్ పేరిట కరెంట్ నిలిపివేత
- పొదులను మాత్రం తొలగించని వైనం


పెరవలి వద్ద జాతీయ రహదారి పక్కనే విద్యుత్ స్తంభాన్ని చుట్టేసిన పొదులు


నల్లాకులవారిపాలెం వద్ద జాతీయ రహదారి పక్కనే విద్యుత్ స్తంభాన్ని అల్లుకున్న తీగలు


ముక్కామల గ్రామ సమీపంలో ఇలా..

పెరవలి: మండలంలో ఎక్కడ చూసినా విద్యుత్ స్తంభాలను పచ్చని పొదులు కింద నుంచి పై వరకూ అల్లేశాయి. పెరవలి సబ్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో జాతీయ రహదారి పక్కనే ప్రధాన లైన్‌లోని స్తంభాన్ని కూడా పొదులు చుట్టేశాయి. అయినప్పటికీ ఆ శాఖ సిబ్బంది వాటిని తొలగించడం లేదు. ఈ సబ్ స్టేషన్‌కు సమీపంలోని కొత్తపల్లి అగ్రహారానికి వెళ్లే విద్యుత్ లైన్ మొత్తం డొంకలు అల్లేశాయి. వాటిని తొలగించకపోవడంతో గాలి వీచినా, వర్షం వచ్చినా సరఫరా నిలిచిపోతోంది. ఇదే పరిస్థితి కొత్తపల్లి అగ్రహారం గ్రామస్తులకు కూడా తప్పడం లేదు. ఈ లైన్ మండలంలోని చివర గ్రామమైన అన్నవరప్పాడు వరకూ వెళుతుంది. స్తంభాలను అల్లుకున్న తీగల వల్ల కొత్తపల్లి అగ్రహారంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే ఈ లైన్‌లోని మిగిలిన తొమ్మిది గ్రామాలకు కూడా సరఫరా నిలిచిపోతుంది. ప్రతి శుక్రవారం ట్రీ కటింగ్ (చెట్ల నరికివేత) అంటూ రోజంతా కరెంట్ సరఫరా నిలిపివేసి ట్రాన్స్‌కో సిబ్బంది చెట్ల కొమ్మలు నరుకుతున్నారు. విద్యుత్ లైన్లపై ఉన్న పొదులను మాత్రం తొలగించడం లేదని పలువురు విద్యుత్ వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

లైన్ల మరమ్మతుల పేరుతో..

లైన్ల మరమ్మతులు అంటూ ఈ నెల ఒకటో తేదీన మండలంలోని చాలా గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఏ లైన్‌లకు మరమ్మతులు చేశారో ఆ శాఖ అధికారులే చెప్పాలని కొందరు వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. అలా కాదు కేవలం ఫ్యాక్టరీలకు వెళ్లే హైటెన్షన్ లైన్లకు మాత్రమే మరమ్మతుల చేస్తున్నారని మరికొందరు విద్యుత్తు వినియోగదారులు ఆరోపిస్తున్నారు. మరోపక్క మండలంలోని మారుమూల గ్రామాల్లో తరచూ విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతోంది. గంటల తరబడి సరఫరా నిలిచిపోతున్నా మరమ్మతులు చేపట్టి, సరఫరాను పునరుద్ధరించడం లేదని విమర్శలు వస్తున్నాయి. విద్యుత్తు సరఫరా విషయంలో శ్రద్ధ వహించని ఆ శాఖ అధికారులు గడువులోగా బిల్లులు చెల్లించకపోతే ఫ్యూజులు మాత్రం తొలగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు శ్రద్ధ వహించి విద్యుత్ లైన్లను అల్లేసిన డొంకలను, పొదులను తొలగించాలని వినియోగదారులు కోరుతున్నారు.

పొదులను వెంటనే తొలగిస్తాం

మండలంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్తు స్తంభాలను అల్లుకున్న పొదులను యుద్ధప్రాతిపాదిక తొలగిస్తాం. పొదులు, తీగల వల్ల విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటాం. ఇందుకోసం ఆయా గ్రామాల లైన్‌మన్లకు తగిన ఆదేశాలు ఇస్తాం. ఈ నెల 1న కరెంటు సరఫరా నిలిపి వేసినపుడు మండలంలోని పలు లైన్లలో మరమ్మతులు పూర్తి చేశాం.

– దేవిడ్ నిశ్చల్ ట్రాన్స్‌కో ఏఈ, పెరవలి

ప్రేమ, కరుణ, క్షమాగుణం అలవరచుకోవాలి

చాగల్లు: ప్రేమ, కరుణ, క్షమాగుణం అలవరచుకుంటే జీవితం ఆనందంగా సాగిపోతుందని విశాఖకు చెందిన పిరమిడ్ సీనియర్ మాస్టర్ పీఎస్ఎన్ మూర్తి అన్నారు. ఎస్.ముప్పవరం గ్రామంలోని పరమాత్మ పిరమిడ్ వద్ద ఆదివారం 189వ ఉచిత ధ్యాన శిక్షణ తరగతులు నిర్వహించారు. నిడదవోలు పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూమెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మరో ముఖ్య అతిథిగా విచ్చేసిన పీఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ ధ్యానంతో ప్రశాంతతతో పాటు సంపూర్ణ ఆరోగ్యం, బుద్ధి కుశలత ఆధ్యాత్మిక జ్ఞానం పెరుగుతుందన్నారు. నిడదవోలు పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ అధ్యక్షుడు ఎంఏ ప్రసాద్ మాట్లాడుతూ ధ్యానం చేసిన వారు ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. ధ్యానం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో అల్లు సత్యనారాయణ, బి.సత్యనారాయణ, ఎం శ్రీనివాసరావు చాగల్లు, దారవరం, పశివేదల, ఊనగట్ల, నిడదవోలు తదితర ప్రాంతాల ధ్యానులు పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనతో దేశ ప్రగతి

పెరవలి: అవినీతి నిర్మూలనతో దేశాభివృద్ధి సాధ్యపడుతుందని ఎల్ఐసీ తణుకు బ్రాంచ్ మేనేజర్ ఎస్.రాజశేఖర్ అన్నారు. విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని ముక్కామల గ్రామంలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. రాజశేఖర్ మాట్లాడుతూ దేశాభివృద్ధికి ఎల్ఐసీ రూ.34.78 వేల కోట్లు పెట్టుబడిగా పెట్టిందన్నారు. ఇంతటి నిజాయితీ గల సంస్థ ప్రపంచంలో ఎక్కడా లేదన్నారు. ప్రజలకు సర్వీస్ చేయడంలోను, సెటిల్‌మెంట్ విజయంలో 99 శాతం లబ్ధిదారుడికి అందేలా వ్యవహరిస్తోందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వెంకటేశ్వర్లు, గ్రామపెద్ద బోళ్ల మంగారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు గోష్పాద క్షేత్రంలో గోదావరి హారతి

- టీటీడీ ఆధ్వర్యంలో నదిపై ప్రత్యేక వేదిక
- వేంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలకు కల్యాణం


గోదావరి హారతి ఇచ్చేందుకు గోష్పాద క్షేత్రంలో నదిపై ఏర్పాటు చేస్తున్న వేదిక

కొవ్వూరు: కార్తిక సోమవారం సందర్భంగా ఈనెల 4న స్థానిక గోష్పాద క్షేత్రంలో గోదావరి హారతి వేడుక నిర్వహిస్తారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి సుమారు పది వేల మంది భక్తులు హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. సోమవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి వేంకటేశ్వర స్వామి భక్తి గీతాలు ఆలపిస్తూ కోలాట బృందాలు నృత్యాలు చేస్తాయి. అనంతరం గోదావరి నది మధ్యలో ఏర్పాటు చేసిన పంట్లపై తిరుమల నుంచి తీసుకు వచ్చిన స్వామి ఉత్సవ విగ్రహాలకు వేద పండితులు శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహిస్తారు. ఇందుకోసం నదిపై ప్రత్యేక వేదిక ఏర్పాటు చేస్తున్నారు. టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు విశేష అధికారి పీఆర్ ఆనంద తీర్థాచార్యుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరుగుతోంది. టీటీడీ నుంచి వచ్చే సంగీత విద్వాంసులు స్వామివారి గీతాలాపన చేస్తారు. సోమవారం రాత్రి ఏడు గంటలకు గోదావరి నదికి చీర, పసుపు కుంకుమ, గాజులు సమర్పించిన అనంతరం పండితులు వివిధ రకాల హారతులు ఇస్తారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు హాజరయ్యే వీఐపీలకు ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేశారు. భక్తులు స్నానఘట్టంలో కూర్చొని పూజా కార్యక్రమాలు, గోదావరి హారతి తిలకించేలా ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు.

మరిన్ని గ్రామాల్లో జల్‌జీవన్ పనులు

- తొలి దశ 12 గ్రామల్లో చురుగ్గా నిర్మాణాలు
- 8 ఎనిమిది గ్రామాల్లో ఇప్పటికే పూర్తి


నల్లజర్లలో నిర్మాణం పూర్తయిన ఓవర్ హెడ్ ట్యాంకు


పైపులైన్ వేసేందుకు తీసిన గోతులు

నల్లజర్ల: జల్‌జీవన్ మిషన్ (జేజేఎం)లో భాగంగా మరిన్ని గ్రామాల్లో ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇవ్వనున్నారు. నల్లజర్ల మండలంలో తొలి విడతగా 12 గ్రామాల్లో ఈ పనులు చేపట్టగా ఎనిమిది గ్రామాల్లో ఇప్పటికే పనులు పూర్తయ్యాయి. అనంతపల్లి, గంటావారిగూడెంలలో ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. దూబచర్ల, అచ్చన్నపాలెం గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ పనులు ప్రారంభించాల్సి ఉంది. మలి విడతలో 12 గ్రామాల్లో ఈ పనులకు సన్నాహాలు జరుగుతున్నాయి.

ఇంటింటికీ తాగునీటి కుళాయిల ఏర్పాటులో భాగంగా పైపులైన్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి.అవసరమైన చోట ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించారు. ప్రస్తుతం ఈ పనులన్నీ చివరి దశలో ఉన్నాయి. మండలంలోని మొత్తం 24 గ్రామ పంచాయతీల పరిధిలో 104 కిలోమీటర్ల పొడవైన పైపులైన్ల, ఐదు ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణాలకు ప్రతిపాదించారు. ఇందుకోసం రూ.16.06 కోట్లు ఖర్చు చేస్తారు. మొదటి దశలో 12 గ్రామాలకు 54 కిలోమీటర్ల పొడవైన పైపులైన్ల నిర్మాణం చేపట్టారు. అలాగే నల్లజర్లలో 1.50 లక్షల లీటర్ల, ముసుళ్లగుంటలో 40 వేల లీటర్ల, ఆవపాడులో 40 వేలలీటర్ల నీటి సామర్థ్యం గల ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపట్టారు.తొలి దశ పైప్‌లైన్ల, ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణానికి రూ.5.56 కోట్లు మంజూరయ్యాయి. ప్రత్యేక ప్యాకేజీగా పోతవరం పంచాయతీలో రూ.కోటి వ్యయంతో పైపులైను, రెండు ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపట్టారు. రెండో దశలో మిగిలిన 12 గ్రామాల పరిధిలో 50 కిలోమీటర్ల పొడవైన పైపులైన్లు, నబీపేటలో 40 వేల లీటర్ల, గంటావారిగూడెంలో 40 వేల లీటర్ల నీటి సామర్థ్యం గల ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మిస్తారు.

త్వరలో పనుల పూర్తి



మొదటి దశ పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. బీఆర్ ఇన్‌ఫ్రా అనే సంస్థ ఈ పనుల టెండరు దక్కించుకొని పనులు చేపట్టింది. నల్లజర్లలో తొమ్మిది కిలోమీటర్ల పైపు లైన్ వేశాం. మరో ఆరు కిలోమీటర్లు మంజూరైంది. ప్రకాశరావుపాలెంలో ఇప్పటికే నాలుగున్నర కిలోమీటర్ల పైప్‌లైన్ వేశాం. గంటావారిగూడెం, నబీపేటలలో 40 వేల లీటర్ల నీటి సామర్థ్యం గల రెండు ఓహెచ్ఆర్‌లు మంజూరయ్యాయి.

–అజయ్‌బాబు, ఏఈ, గ్రామీణ నీటిసరఫరా విభాగం, నల్లజర్ల

యాదవ సంఘం మండల నూతన కార్యవర్గం


యాదవ సంఘ మండల నూతన కార్యవర్గ సభ్యులు

నిడదవోలు: యాదవ సంఘ మండల శాఖ సమావేశాన్ని ఆదివారం స్థానిక మదన గోపాలస్వామి ఆలయంలో నిర్వహించారు. సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ మండల శాఖ నూతన అధ్యక్షుడిగా గాలి బంగారయ్య, గౌరవాధ్యక్షుడిగా తీర్థాల రామచంద్రరావు, ఉపాధ్యక్షుడిగా తీర్థాల చంద్రరావు, కార్యదర్శిగా గుడ్ల వెంకటనారాయణ, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కండే గురునాథం, కోశాధికారిగా గుడిగుంట్ల ప్రసాద్, సహాయ కార్యదర్శిగా నాగళ్ల బాలాజీ ఎన్నికయ్యారు. మరికొందరిని కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బంగారయ్య మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా కమిటీల పిలుపు మేరకు పని చేస్తానన్నారు. యాదవులందరినీ కలుపుకుని నిడదవోలు యాదవ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ముప్పనబోయిన గంగారావు, దండుపోయిన రాము, గుడిగుంట్ల వెంకటేశ్వరరావు, తీర్థాల వెంకట సత్యనారాయణ, అమర్తి శ్రీనివాసరావు, మందపాటి సత్యనారాయణ, తాతా నరేంద్రనాగ్ యాదవ్, దండు బోయిన సోమరాజు పాల్గొన్నారు.

10న కార్తిక వన సమారాధన

తిమ్మరాజుపాలెం గ్రామ శివార్లలోని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ తోటలో ఈనెల 10న గోకుల కృష్ణ యాదవ్ సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని ఆ సంఘాధ్యక్షుడు గంగుల గోపీ యాదవ్, కార్యదర్శి గుడ్ల సతీష్ యాదవ్ తెలిపారు.

బాలికల హాస్టల్‌లో జడ్జి తనిఖీలు


నిత్యావసరాలు తనిఖీ చేస్తున్న ప్రిన్సిపల్ సివిల్ జడ్జి రామకృష్ణ

నిడదవోలు: మండలంలోని సెట్టిపేట గ్రామ శివార్లలోని హెబ్రోన్ బాలికల వసతిగృహన్ని శనివారం రాత్రి నిడదవోలు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.రామకృష్ణ తనిఖీ చేశారు. ఇక్కడి విద్యార్థినులతో ఆయన మాట్లాడారు. వారికి అందుతున్న సదుపాయాల గురించి ఆరా తీశారు. హాస్టల్ స్థితిగతులు, వంట గది, మరుగుదొడ్లను పరిశీలించారు. హాస్టల్ నిర్వహణకు అవసరమైన సదుపాయాలను వార్డెన్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినుల కోసం తయారు చేసిన భోజనాన్ని జడ్జి పరిశీలించారు. నిత్యావసరాలను, హాస్టల్ రికార్డులను పరిశీలించారు.

వేదాధ్యయనంతో ధర్మ పరిరక్షణ

- పలువురు వేద పండితుల సూచన
- గోష్పాద క్షేత్రంలో వేద సభ


కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో వేద సభలో పాల్గొన్న పండితులు

కొవ్వూరు: సనాతన హిందూ ధర్మ పరిరక్షణకు వేదాలను అధ్యయనం చేయాలని పండితులు సూచించారు. స్థానిక గోష్పాద క్షేత్రంలో ఆదివారం మధ్యాహ్నం వేద సభ నిర్వహించారు. ఇక్కడి నిరంజన్ ధర్మజ్ఞాన కళావేదికపై వేద శాస్త్రాభివర్ధక పరిషత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. క్రమా పాఠిలు, ఘనాపాఠిలు వేదస్వస్తి నిర్వహించారు. నాలుగు వేదాల పఠనం ద్వారా ధర్మనష్టం చేయాలని పండితులు అన్నారు. నోరి భోగేశ్వర శర్మ, మహా మహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ, దువ్వూరి వెంకటఫణి సోమయాజులు, తంగిరాల సుబ్రహ్మణ్యం, దివేది సుబ్రహ్మణ్యం,దుళ్లపల్లి శివప్రాతి, దుళ్లపల్లి ఆంజనేయ ఘనపాఠి తదితరులు వేద స్వస్తి నిర్వహించారు. మహా మహోపాధ్యాయ దోర్బల ప్రభాకర శర్మ, వేద శాస్త్రాభివర్ధక పరిషత్ అధ్యక్షుడు డీఆర్ఎస్ఎన్ శాస్త్రి, కార్యదర్శి కలిగోట్ల కృష్ణారావు, పాలకోడేటి సత్యనారాయణమూర్తి, బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పిల్లలమర్రి మురళీకృష్ణ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. హైదరాబాద్, విశాఖ పట్నం, విజయవాడ, కపిలేశ్వరపురంలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రమా పాఠిలు, ఘనాపాఠిలు ఈ వేద సభలో పాల్గొన్నారు.

1,008 విద్యార్థులతో హనుమాన్ చాలీసా పారాయణ


ఉండ్రాజవరం సుంకవల్లి పాఠశాలలో హనుమాన్ చాలీసా పారాయణ చేస్తున్న విద్యార్థులు

ఉండ్రాజవరం: స్థానిక సుంకవల్లి పాఠశాల ఆవరణలో ఆదివారం వివిధ పాఠశాలలకు చెందిన 1,008 మంది విద్యార్థులు 11 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. కార్తిక మాసాన్ని పురస్కరించుకుని పెరవలికి చెందిన హిందూ ధర్మ పరిరక్షణ సేవాసమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. తొలుత జ్యోశ్యుల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో గణపతి పూజ, ఆంజనేయ స్వామి అష్టోత్తర పూజ నిర్వహించారు. అనంతరం గన్నవరపు శంకర్‌శర్మచే హనుమద్ వైభవం ప్రవచనం నిర్వహించారు. ఈ సందర్భంగా సమన్వయకర్త సీహెచ్ నాగభూషణం మాట్లాడుతూ చిన్నారులకు సనాతన సంప్రదాయాలను పరిచయం చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. సుంకవల్లి సూర్యనారాయణ, గన్నమని వెంకట సుబ్రహ్మణ్యం, కుదప చక్రపాణి, సుంకవల్లి వెంకటేశ్వర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాలంగి రామలింగేశ్వరునికి 'కార్తిక' పూజలు

ఉండ్రాజవరం: కార్తిక మాసం సందర్భంగా పాలంగి గ్రామంలో కొలువైన రామలింగేశ్వరస్వామి వారికి శనివారం నుంచి నిత్యార్చన, విశిష్ట అభిషేకాలు నిర్వహిస్తున్నారు. డిసెంబర్ 2వ తేదీ వరకూ స్వామి వారికి ఈ క్రతువులు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ చేసినట్టు ఆలయ ఈవో ఎంవీ రామయ్య ఆదివారం తెలిపారు. కార్తక మాసం పొడవునా స్వామి వారికి రోజూ ఉదయం 5 గంటలకు ప్రాతఃకాల అభిషేకాలు, సాయంత్రం ఆకాశ దీపం పూజలు జరుగుతాయన్నారు. ప్రతి సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు ప్రత్యేక అభిషేకాలు, అనంతరం స్వామి వారికి దర్శించడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

వేతనాల కోసం 108,104 సిబ్బంది ఆందోళన


నల్లజర్లలో ఆందోళన చేస్తున్న 108,104 వాహనాల సిబ్బంది

నల్లజర్ల: తమ వేతన బకాయిలు చెల్లించాలని 108, 104 వాహనాల సిబ్బంది ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమకు వేతనాలు చెల్లించి మూడు నెలలైందని వారు వాపోయారు. ఉద్యోగులు నల్లజర్లలో ఆదివారం ఆందోళన చేశారు. తక్షణం వారికి వేతనాలు అందించాలని వైద్య, ఉద్యోగుల సంఘ నాయకులు జీవీవీ ప్రసాద్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వారు చేస్తున్న ఆందోళనకు ప్రసాద్ సంఘీభావం ప్రకటించారు. ఆందోళనలో ఆంధ్రదేశ్ 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఉద్యోగుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జుల రమేష్ బాబు, నాయకులు మానుకొండ సురేష్, ముప్పిడి రవికుమార్, కాళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కైవల్యరెడ్డి


కైవల్యరెడ్డికి అవార్డు అందిస్తున్న తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధి శ్రీనివాస్

నిడదవోలు: పట్టణానికి చెందిన ఇంటర్ సెకండియర్ విద్యార్థి కుంచాల కైవల్యరెడ్డి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది. తాడేపల్లిగూడెంలో శనివారం ఆమెకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ఉమ్మడి పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల ప్రతినిధి సిరిమువ్వ శ్రీనివాస్ చేతుల మీదుగా ఈ పురస్కారం అందజేశారు. బహుముఖ ప్రజ్ఞతో 15 ఏళ్ల వయసులో వివిధ రంగాల్లో కైవల్య రెడ్డి సాధించిన విజయాలను ప్రశంసిస్తూ ఆమెకు ఈ అవార్డు ప్రదానం చేశారు.

గోలింగేశ్వరునికి లక్షపత్రి పూజ

నిడదవోలు: స్థానిక గోలింగేశ్వరస్వామి వారికి ఆదివారం 642వ లక్ష పత్రి పూజ వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారికి అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో ఈవో నామా సూర్యప్రకాశ్, ప్రధానార్చకుడు శ్రీకాకుళపు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.